మద్యం షాపు ఏర్పాట్లను అడ్డుకున్న మహిళలు, జనసైనికులు

విశాలాంధ్ర-అనకాపల్లి: పట్టణ సమీపంలో శారదానగర్ లో నూతనంగా ఏర్పాటుచేస్తున్న మద్యం షాపును జనసైనికులు, మహిళలు అడ్డుకున్నారు. ప్రభుత్వం ఈమధ్య నిర్వహించిన లాటరీలో శారదానగర్ షాపును దక్కించుకున్న యాజమాన్యం గురువారం మద్యం షాపును ప్రారంభిస్తుండగా మహిళలు, జన సైనికులు భారీగా అక్కడ చేరుకుని షాపును తెరవనీయకుండా ఆందోళన చేశారు. బడి, గుడి సమీపంలో నివాస గృహాల దగ్గర మద్యం షాపులు ఏర్పాటు చేయడం వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతాయని షాపును తెరిపించే ప్రయత్నాలు చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని ఇరు వర్గాలకు సద్దిచెప్పే ప్రయత్నం చేశారు. నిబంధనలను అనుసరించే షాపు ఉండాలని లేని పక్షంలో ఇక్కడి నుంచి షాపుని తొలగించాలని హామీ ఇచ్చి షాప్ ఓపెనింగ్ ను విరమింపచేశారు. వీధికో వైన్ షాప్ తెరిచి ఈ సమాజానికి ప్రభుత్వం ఏ సందేశం ఇవ్వాలని చూస్తుందో అర్థం కాలేదంటూ మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

పాల ధర తగ్గడంపై భగ్గుమన్న పాడి రైతులు

-పాల సేకరణ కేంద్రం వద్ద పాడి రైతుల ధర్నా
-డెయిరీ చైర్మన్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు

విశాలాంధ్ర-కే కోటపాడు: విశాఖ డెయిరీ యాజమాన్యం ఒక్కసారిగా ఆవు పాల ధరను తగ్గించడంపై మండలంలోని చౌడువాడలోఉన్న పాల సేకరణ కేంద్రం వద్ద గురువారం పాడి రైతులు నిరసన చేపట్టారు. సొసైటీ సిబ్బంది పాలసేకరణ చేయుటకు ప్రయ త్నించగా రైతులంతా అడ్డుకొని సొసైటీకి కొద్దిసేపు గేట్లు బిగించారు. డైరీ యాజమాన్యం వారు సరఫరా చేస్తున్న పశు దాణ రేట్లు రోజురోజుకు పెంచుకుం టూపోతూ పాలు రేట్లుతగ్గించడం ఏమాత్రం మంచిది కాదని రైతులు హెచ్చరించారు. రోజు రోజుకి పశువులుకు కావలసిన నూకలు, తవుడు మొదలైన దాణా ధరలు పెరిగిపోతూ ఉండగా పాల రేట్లు పెంచవలసింది పోయి తగ్గించడం ఏమిటని రైతులు మండిపడ్డారు. ప్రస్తుతము రైతులకు వ్యవసాయం లాభసాటిగా లేకపోవడంతో వ్యవసాయాన్ని విస్మరించి తమకు ఉన్న కొద్దిపాటి భూములు పశుగ్రాసాన్ని పెంచుకుంటూ పాడిపసువులను అభివృద్ధి చేస్తూ అవి ఇచ్చే పాలతో జీవనం సాగిస్తున్న రైతులను విశాఖ డైరీ యాజమాన్యం ఒక్కసారిగా ధర తగ్గించి నడ్డి విరుస్తుందని రైతులు వాపోయారు. రెండు సంవత్సరాలగా విశాఖ డైరీ నుంచి ఒక్క పైసా కూడా బోనస్సు ఇచ్చిన పాపాన పోలేదని మరలా ఇప్పుడు రేట్లు తగ్గించడం మంచిది కాదన్నారు. గతంలో ఆవు పాలు ఎక్కువగా వెన్న శాతం వచ్చే వారికి 33.93 రూపాయల నుంచి 44.05 వరకు చెల్లించే వారని , ప్రస్తుతము నుంచి 40.86 రూపాయలకు తగ్గించారని వారు వాపోయారు. ఆవు పాలు రేటు భారీగా తగ్గించి గేదె పాలుకు కొద్దిపాటిగా ధర పెంచారని రైతులు తెలిపారు. ప్రస్తుతము పాడి రైతులు విశాఖ డైరీ పరిధిలో అలాగే ప్రతి మండలంలో ఎక్కువగా ఆవుపాలు సరఫరా అవుతున్నాయి. రైతులకు గేదెల కన్నా ఆవులు పెంచి పోషించడమే లాభ సాటుగా ఉంది. ఈ నేపథ్యంలో ఆవుపాలపై ఆధారపడే రైతులకు డైరీ ఒక్కసారిగా మూడు రూపాయలు తగ్గించడం అన్యాయమని అన్నారు. ఒక దశలో డైరీ చైర్మన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. వెంటనే పాల సంఘం అధ్యక్షుడు కుమార వెంకటరమణ డైరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్ అక్కడికి చేరుకుని యాజమా న్యంతో మాట్లాడి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో పాడు రైతులు శాంతించారు.

ఉల్లాస్' పథకంపై అవగాహన కల్పించాలి

కలెక్టర్ విజయ క్రిష్ణన్

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన "ఉల్లాస్" కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్ తెలిపారు. ఉల్లాస్ కార్యక్రమంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం వయోజన విద్యా శాఖ ఆధ్వర్యంలో గురువారం ఉదయం కలెక్టర్ చాంబరులో జరిగింది. ఈ సమావేశంలో జిల్లాకలెక్టరు మాట్లాడుతూ. ఉల్లాస్ పథకంపై ప్రచారం ద్వారా అవగాహన కల్పించాలని, జిల్లాకు ఇచ్చిన లక్ష్యాలను పూర్తిచేయాలని తెలిపారు. 2024-25 సంవత్సరానికి 11900 మందికి వయోజన విద్యను అందించడమే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అక్ష్యరాస్యత శాతం తక్కువగా గల మండలాలపై ప్రత్యేక శ్రద్ధవహించాలని జిల్లా కలెక్టరు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయుటకు పంచాయతీరాజ్, గ్రామసచివాలయం, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశుసంక్షేమం, విద్యాశాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. అంగన్వాడిలు, పాఠశాలలలో పనిచేస్తున్న క్రిందిస్థాయి సిబ్బంది, స్వయం సహాయక సంఘాలు, ఉపాధిహామీ కూలీలలో నిరక్షరాస్యులైన వారిని గుర్తించి ఆ సమాచారాన్ని వయోజనవిద్య అదికారులకు అందించాలని, వారిని ఈ పథకంద్వారా అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని తెలిపారు. గ్రామాలలో అంగన్ వాడీ సెంటర్లను అక్షరాస్యతా కేంద్రాలుగా వినియోగించుకోవాలని తెలిపారు. ప్రతి వాలంటరీ టీచరు కనీసం పదిమందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేలా చూడాలన్నారు. సచివాలయ స్థాయిలో సంక్షేమ సహాయకులు, విద్యా సహాయకులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని, నిరక్షరాస్యులను గుర్తించి సమాచారాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛందంగా సేవలందించే టీచర్లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ పథకానికి సంబంధించి సరఫరాచేసిన పుస్తకాలలోని పాఠాలను నిరక్షరాస్యులకు బోధించి, ప్రాథమిక అవగాహన పెంచాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో వయోజన విద్య ఉపసంచాలకులు వి.ఎస్. సుబ్రమణ్యవర్మ, సహాయ సంచాలకులు డి. చిన్నికృష్ణ, కమిటీ సభ్యులు జిల్లా పంచాయతీ అధికారి ఆర్. శిరీషారాణి, డిఆర్డిఎ పిడి కె.శశిదేవి, డిఐపిఆర్ఒ కె. ఇంద్రావతి, శిశుసంక్షేమశాఖ పిడి కె. అనంతలక్ష్మి, జిల్లా గ్రామవార్డుసచివాలయ అధికారి ఎస్. మంజులవాణి పాల్గొన్నారు.

కరక గ్రామసభలో రీసర్వే సవరణకు 35 మంది దరఖాస్తు

విశాలాంధ్ర-బుచ్చయ్యపేట: రాష్ట్రవ్యాప్తంగా రీ సర్వే జరిగిన గ్రామాలలో ఆర్ ఓ ఆర్ ఫైనల్ రికార్డుల సవరణలు అభ్యంతరాలుకు ఏర్పాటుచేసిన గ్రామ సభలలో భాగంగా గురువారం బుచ్చయ్యపేట మండలం కరక గ్రామ పంచాయతీ రెవిన్యూలో మండల తాసిల్దార్ ఎం లక్ష్మీ పాల్గొని గ్రామస్తుల నుండి వచ్చిన 35 దరఖాస్తులు స్వీకరించారు. రీసర్వే లో జరిగిన తప్పులను సవరించడం కొరకు రెవెన్యూ పరిధిలో 35 మంది దరఖాస్తులు ఇచ్చారని వచ్చిన దరఖాస్తులను పరిశీలించి విచారణ జరిపి తగు చర్యలు చేపడతామని తెలిపారు కార్యక్రమంలో ఎంపీపీ దాకవరపు నాగేశ్వరి దేవి, గ్రామ సర్పంచ్ ఎన్నం శెట్టి రమణమ్మ, ఆర్ఐ శ్రావణ్ కుమార్ వీఆర్వోలు జే. వి. రమణ,ఎస్ రమణ, తులసిరావు, సర్వేయర్లు వినోద్, అపర్ణ, గోవిందు, సాయి, సంతోష్, నాగరాజు కూటమి నాయకులు యెన్నంశెట్టి రామారావు ప్రజలు పాల్గొన్నారు.

అభిజిత్ పరిశ్రమ వద్ద కార్మికులు ఆందోళన

విశాలంధ్ర-అచ్యుతాపురం: వెయ్యి మంది కార్మికులను రోడ్డున పడేసిన అభిజిత్ యాజమాన్యంపై ప్రభుత్వం చర్యలు తీసుకుని ఉపాధి కల్పించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము, మండల కన్వీనర్ కె సోము నాయుడు డిమాండ్ చేశారు . గురువారం నాలుగోరోజు వర్షంలోను కార్మికులు అభిజిత్ పరిశ్రమ వద్ద ఆందోళన నిర్వహించారు. పరిశ్రమ వద్దనుండి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి డిప్యూటీ తహసిల్దారుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ అభిజిత్ యాజమాన్యం అక్రమ లే ఆఫ్ ప్రకటించడాని తీవ్రంగా ఖండించారు. కార్మికులతో సంప్రదించకుండా విధులకు హాజరైన కార్మికులను పరిశ్రమలోకి రానివ్వకుండా, అక్రమ నోటీసుఅంటించి గేటు బయట నిలుపుదల చేయడం చట్ట విరుద్ధం 15 రోజులు జీతం ఇస్తాం అని చట్ట వ్యతిరేకంగా చెబుతున్నారన్నారు. నాలుగు రోజులుగా పరిశ్రమ ఎదుట కార్మికులు ఆందోళన నిర్వహిస్తూ డెవలప్మెంట్ కమిషనర్ లేబర్ , తహసిల్దార్ కి తెలియజేసినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమని, వెంటనే ప్రభుత్వం కలగజేసుకొని 1000 మంది కార్మికులకు అబిజిత్ పరిశ్రమలో ఉపాధి కల్పించాలని, యాజమాన్యం వెంటనే కార్మికులతో చర్చించి సమస్య పరిష్కారం చేయాలని లేదంటే కార్మికులంతా ఐక్యమై పెద్దఎత్తున పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అభిజిత్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సాగునీటి వనరుల అభివృద్ధిపై చర్యలు చేపట్టండి

22న అనకాపల్లిలో జరిగే రైతాంగ ప్రాంతీయ సదస్సు విజయవంతం చేయండి

రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు

విశాలాంధ్ర-చోడవరం: ఉత్తరాంధ్రలో గల సాగునీటి ప్రాజెక్టులు అభివృద్ధిపై ప్రభుత్వం తక్షణమే అభివృద్ధి చర్యలు చేపట్టాలని ఏ.పీ. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు డిమాండ్ చేశారు. ఈ నెల 22న అనకాపల్లిలో నిర్వహించనున్న రైతాంగ ప్రాంతీయ సదస్సు ను విజయవంతం చేయాలని రైతు సంఘం నేత రెడ్డిపల్లి కోరారు. కమ్యూనిస్టు అనుబంధ సంఘాల ముఖ్య నేతలతో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రాంతాలైన విశాఖ ఉమ్మడి జిల్లాలు, శ్రీకాకుళం, విజయనగరం తదితర జిల్లాల్లో సుమారు 25000 సాగునీటి చెరువులు క్రింద 23.24 లక్షలు ఎకరాలు సారవంతమైన భూములుండగా, కేవలం 8 లక్షల ఎకరాలకు ఖరీఫ్ సీజన్ లో వర్షాధారంగా మాత్రమే పంటలు పండి0చాల్సి వస్తోందని అన్నారు. ఉత్తరాంధ్ర లో ఎన్ని సాగునీటి వనరులు వున్నప్పటికీ వాటి అభివృద్ధి పై పాలకులు శ్రద్ధ చూపకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి అన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, ప్రధాన చెరువులు, గెడ్డ తదితర సాగునీటి వనరులను అభివృద్ధి చేస్తే రెండు పంటలు పండి సస్య శ్యామలం అవుతాయని తెలిపారు. అధికార కూటమి ప్రభుత్వం పెద్దలు, పాలకులు, ఇరిగేషన్ అధికారులు తక్షణమే ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులు అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏ.పి. చెరకు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేచలపు వెంకటరమణ (కాసుబాబు), మండల రైతు సంఘం కార్యదర్శి రొంగలి నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్ గురై వ్యక్తి మృతి

విశాలాంధ్ర-పాయకరావుపేట: మండలంలోని గుంటపల్లి గ్రామంలో విద్యుత్ షాక్ గురై వ్యక్తి మృతి చెందినట్లు ఏఎస్ఐ గోవిందరావు తెలిపారు. గుంటపల్లి గ్రామానికి చెందిన తోట పద్మ నాగేశ్వరరావు (58) ఇంటి పై భాగంలో ఇంటి నిర్మాణం చేస్తున్నదంతో స్టీల్ రాడ్ మేడ పైకి తీసుకెళుతున్న సమయంలో అనుకోకుండా ఇంటి ముందు ఉన్న విద్యుత్ వైర్లకు తగిలింది. దీంతో పద్మ నాగేశ్వరరావుకు విద్యుత్ షాక్ తగిలి కుప్పకూలిపోయాడు. తుని ప్రభుత్వ ఆసుపత్రి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతుడు భార్య లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ గోవిందరావు తెలిపారు.

గ్రామాభివృద్ధికి సహకరించండి : తహాశీల్దార్

విశాలాంధ్ర నక్కపల్లి : వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కు జరిగిన భూ సేకరణ సంబంధించి గురువారం వేంపాడు శివారు మూలపర్ర ధోనివానిలక్ష్మీపురం గ్రామాల్లో తహసీల్దార్ ఆర్ నరసింహమూర్తి ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. ఈ గ్రామ సభల్లో తహసీల్దార్ నరసింహమూర్తి మాట్లాడుతూ భూసేకరణ జరిగిన గ్రామాల్లో నిర్వాసితులకు పూర్తిస్థాయి ప్రభుత్వము నుండి పరిహారం అందించడం జరిగిందన్నారు. నిర్వాసితులకు ప్యాకేజీ పునరావాసం కల్పించాలని వినతి పత్రాలు అందించారని దీనిపై వాటిని పరిశీలిస్తున్నామని అన్నారు. ఈ మేరకు నిర్వాసితులు మాట్లాడుతూ కొంతమందికి పరిహారం ఇంకా అందలేదని తాసిల్దార్ తెలిపారు. దీనిపై మండల స్థాయి సర్వేర్లు నియమించి వాటిని గుర్తించడం జరుగుతుందన్నారు. భూసేకరణ జరిగిన గ్రామాల్లో పరిశ్రమలు ఏర్పాటుకు ముందుకు వస్తున్నారని దీంతో గ్రామాల అభివృద్ధి చెంది ఉద్యోగ అవకాశాలకు వస్తాయని గ్రామస్తులకు తహసిల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిటి అన్నాజీ రావు ఆరే కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలి

అధికారులకు కలెక్టరు విజయ క్రిష్ణన్ ఆదేశం

విశాలాంధ్ర-అనకాపల్లి: వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ రైతులకు అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్ తెలిపారు. గురువారం కలెక్టరు కార్యాలయ సమావేశమందిరంలో వ్యవసాయ శాఖపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పొలంబడి, పొలం పిలుస్తోంది, పి.ఎం.కిసాన్, పకృతివ్యవసాయం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జిల్లా కలెక్టరు మాట్లాడుతూ. వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలని, రైతులకు కావలసిన సమాచారం, సహాయం వెంటనే అందించాలన్నారు. వ్యవసాయ ప్రయోగాలు వలన ఉపయోగాలను రైతులకు తెలియజేయాలని తెలిపారు. రైతుల రిజిస్ట్రేషను, ఇకెవైసీ నూరు శాతం పూర్తిచేయాలన్నారు. పొలంబడి, పొలం పిలుస్తోంది కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించాలని, రైతులను భాగస్వామ్యులను చేసి, నూతన సాగు పద్ధతులపై అవగాహన, ఆశక్తి కల్పించాలని తెలిపారు. వరి పంట మినహా మిగిలిన పంటల లక్ష్యాలు పూర్తికావడం లేదని, పప్పుధాన్యాలు, సిరిధాన్యాల సాగు విస్తీర్ణం పెంచేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం ఖరీఫ్ పంట సాగుదశలో ఉందని తదుపరి సాగుచేసే రబీ పంటకు కావలసిన ప్రణాళికను సిద్ధంచేసుకోవాలని జిల్లా కలెక్టరు తెలిపారు. రసాయన ఎరువులు వాడకం తగ్గించాలని, ప్రకృతి వ్యవసాయం పై ప్రచారం కల్పించాలని, ఆయా ఉత్పత్తులకు మార్కెటింగు కల్పించాలన్నారు. పిఎం కిసాన్ లబ్దిదారుల పరిశీలన, సిసిఆర్ సి కార్డులు పంపిణీ లక్ష్యాలను పూర్తిచేయాలని, మండల స్థాయి నివేదికను రూపొందించి తరువాత సమావేశానికి అందించాలని ఆదేశించారు. చివంగా పకృతి వ్యవసాయంపై సమాచారం అందించే పుస్తకాన్ని విడుదల చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి బి. మోహనరావు, ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రోజెక్టు మేనేజరు సిహెచ్.లచ్చన్న, వ్యవసాయశాఖ ఎడిఎ, మండల ఎఒలు పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు

విశాలాంధ్ర-అనకాపల్లి: వాల్మీకి మహర్షి రచించిన రామాయణం స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ మానవతా విలువలను, ఉన్నతమైన ఆదర్శ భావాలను పెంపొందించుకోవాలని జిల్లా అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్ ఆకాంక్షించారు. అదనపు ఎస్పీ జిల్లా పోలీస్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాలు లో శ్రీ వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీ వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి స్మరించుకున్నారు. ఈసందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ... మానవతా విలువలను, ఉన్నతమైన ఆదర్శ భావాలను బోధించే మధుర కావ్యం రామాయణం అని అన్నారు. యుగాలు మారినా కూడా ఆదర్శంగా నిలిచే విధంగా వాల్మీకి మహర్షి సమాజానికి అందించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్లు ఎస్.బాల సూర్యరావు, ఎస్.రమేష్, ఎస్సై బి.సురేష్ బాబు మరియు కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పల్లె పండగతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర-చీడికాడ : పల్లె పండగ తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మండలంలోని తురువోలు చెట్టుపల్లి పెదగొగాడ జి కొత్తపల్లి చీడికాడ కోణం ఖండివరం తదితరు గ్రామాలలో పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమనికి రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు విచ్చేసారు ఈసందర్బంగా సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ నియోజకవర్గానికి రూ.30 కోట్లతో సిసి రోడ్లు నిర్మించేందుకు నిధులు విడుదలయ్యాయి అన్నారు మండలానికి 5 కోట్ల రూపాయలతో వివిధ గ్రామాలలో రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసామన్నారు ఈ పనులను డిసెంబర్ నెలలోగా పూర్తి చేయాలని కోరారు అవసరమైన చోట మరిన్ని నిధులను రెండొవ దఫాలో మంజూరు చేస్తామని తెలిపారు ఈకార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు పైలా ప్రసాదరావు జనసేన మండల అధ్యక్షులడు రాయపపుడ్డి కృష్ణ రెడ్డి రాము పేరపు కొండబాబు రెడ్డి సన్యాసినాయుడు తేడా కృష్ణ సూరినాయుడు శిరంరెడ్డి నాయుడు కుచ్చు కళావతి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ డెయిరీ రైతుల పాల సేకరణ ధర తగ్గించడం దుర్మార్గం : సీపీఐ మండిపాటు

విశాలాంధ్ర-అనకాపల్లి: విజయ్ విశాఖ డైరీ కి ఆవుపాలుపోస్తున్న రైతులకు కొనుగోలు ధరలో లీటర్ కు మూడు రూపాయలు కోత విధించడం దుర్మార్గమని సిపిఐ అనకాపల్లి ఏరియా కమిటీ తీవ్రంగా మండిపడింది. రైతుల శ్రమతో కోట్లు కూడబెట్టుకున్న విశాఖ డైరీ యాజమాన్యం పాడి పరిశ్రమను ప్రోత్స ఇస్తున్నామని బీరాలు పలుకుతున్న యాజమాన్యం రైతులు దగ్గర నుండి సేకరించిన పాలకు ధర పెంచవలసింది పోయి తిరిగి లీటర్ కు మూడు రూపాయలు కోత విధించడం దుర్మార్గమన్నారు. లక్షలు రూపాయల ఖర్చు చేసి ఆవులు కొనుగోలు చేసిన రైతులకు పశువులదాన రేట్లు విపరీతంగా పెరిగాయని, గడ్డి విత్తనాలు, ఆవులకు వినియోగించే మందులు ధరలు విపరీతంగా పెరిగి కుటుంబమంతా కష్టపడినా రైతులు తీవ్రంగా నష్టపోతుంటే ఇప్పుడు డైరీ ధరలో కోత విధించడం మరింత నష్టాలకు గురిచేస్తుందని మండి పడ్డారు. రైతుల వద్ద పాలు లీటరు 42 రూపాయలు కొనుగోలు చేసి దానిలో వెన్న, తదితర పోషకాలు తీసివేసిన అదే పాలను వినియోగదారులకు లీటరు80 రూపాయలకు అమ్ముతూ లాభాలు గడిస్తున్న డైరీ యాజమాన్యం రైతులు నిర్లక్ష్యం చేస్తే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. వెంటనే రైతు నుండి సేకరించే ఆవు పాల ధర లీటరు 60 రూపాయలు పెంచాలని అలాగే సబ్సిడీ ద్వారా దాన, మందులు తదితర సామాగ్రి సరఫరా చేయాలని డైరీ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఓ పక్క రైతులను మరోపక్క పాలు సేకరించే కార్యదర్శులు, హెల్పర్ల కు కనీసజీతాలు పెంచకుండా వాళ్ళ చేత వెట్టి చాకిరీ చేయించుకుని కోట్ల కూడా పెట్టిన విజయ విశాఖ డైరీయాజమాన్యంపై సిబిఐ చే విచారణ జరిపించాలని సిపిఐ డిమాండ్ చేసింది. రైతులకు, కార్మికులకు న్యాయం చేయకుంటే ప్రత్యక్ష పోరాటానికి సిద్ధమవుతామని సిపిఐ అనకాపల్లి జోనల్ కార్యదర్శి వై ఎన్ భద్రం, కోరుబిల్లి శంకర్రావు, చెల్లూరు నాగరాజు,తాకసి వెంకటేశ్వరరావు, శ్రీరామదాసు అబ్బులు, మత్తుర్తి సూరిబాబు తదితరులు తెలియజేశారు.

విజయవాడ వరద బాధితులకు స్టైరెక్స్ ఫార్మా సాయం

విశాలాంధ్ర-అనకాపల్లి: విజయవాడ వరద బాధితుల సహాయార్థం ముఖ్య మంత్రి సహాయనిధికి పరవాడ ఎస్ఇ జెడ్ లోగల స్టైరెక్స్ ఫార్మా కంపెనీవారు రూ.2,50,000/-(రెండు లక్షల యాబదివేల రూపాయలు) చెక్కును కంపెనీ మేనేజింగు డైరెక్టరు ఎస్.వెంకటేశ్వరరావు తరపున వైస్ ప్రెసిడెంటు ఎం.వెంకటరెడ్డి, కలెక్టరు విజయ క్రిష్ణన్ ను గురువారం కలెక్టరేట్ చాంబరు లో కలిసి అందజేసారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోలు బోర్డు ఇఇ పి.ముకుందరావు పాల్గొన్నారు.

మంత్రి సుభాష్ ను కలిసిన ఎమ్మెల్యే సుందరపు

విశాలాంధ్ర-మునగపాక: కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ను ఎలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ గురువారం విజయవాడలో కలిశారు. ఎలమంచిలి నియోజకవర్గంలో పరిశ్రమలలో గల సమస్యలను వివరించి వాటి పరిష్కారం పై సహకరించాలని కోరారు. వీరితోపాటు మునగపాక మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దొడ్డి శ్రీనివాసరావు కూడా ఉన్నారు.

గ్రామసభల్లో ప్రజా అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు



విశాలాంధ్ర-చోడవరం : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు మండలంలోని అన్ని రెవెన్యూ గ్రామాల్లో భూ సంబంధిత రెవెన్యూ సమస్యలు పరిష్కరించేందుకు రీ సర్వే గ్రామ సభలు ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు తెలిపారు. చోడవరం శివారు అన్నవరం, వెంకయ్యగారి పేట గ్రామ సచివాలయంలో తహసీల్దారు ఏ.రామారావు అధ్యక్షతన గురువారం నిర్వహించిన రీ సర్వే గ్రామ సభను ఎమ్మెల్యే ప్రారంభించారు. భూ సంబంధిత, రెవెన్యూ సమస్యలు ప్రజలు అందించిన అర్జీలకు అధికారులు నెలరోజులు కాలపరిమితి లో పరిష్కరిస్తారు అని తెలిపారు. భూ రికార్డులు, సర్వే నెంబర్ సబ్ డివిజన్, పేర్లు తప్పులు, భూ తగాదాలు, అన్నదమ్ముల పంపిణీ, కోర్టు వ్యవహారాలు తదితర అన్ని అంశాలపై అవకాశ మున్నంత వరకు రైతాంగ సమస్యలు పరిష్కారం చూపుతామని, లేనిచో ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్తామని తహసీల్దార్ రామారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నవరం, వెంకయ్యగారి పేట మొత్తం 23 దరఖాస్తులు అందినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. వాటిలో వెంకయ్యగారు పేట నుండి 21 దరఖాస్తులు (విస్తీర్ణ వ్యత్యాసాలు 5, భూమి ఆన్లైన్కై దరఖాస్తులు12, భూమి వివరణ/ సవరణలు 3 పేరు తప్పులు 1 అందగా, అన్నవరం నుండి 02 దరఖాస్తుల్లో విస్తీర్ణ వ్యత్యాసం 1, భూమి ఆన్లైన్ చేయుటకు 2 ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ పి.సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పల్లె పండుగతో గ్రామాల అభివృద్ధి

విశాలాంధ్ర-పాయకరావుపేట : మండలంలోని ఈదటం, కుమారపురం, పాల్మాన్ పేట గ్రామాలలో పల్లెపండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో చేపట్టబోయే అభివృద్ధి పనులకు సంబంధించి శంకుస్థాపన చేశారు. ఈదటం గ్రామంలో రూ. 6.5 లక్షలతో, కుమారపురం గ్రామంలో రూ. 7 లక్షలతో, పాల్మాన్ పేట గ్రామంలో రూ. 15 లక్షలతో రోడ్లు, డ్రైన్లు నిర్మించనున్నారు. ఉపాధి హామీ పథకం 75 శాతం నిధులు, ఆయా గ్రామ పంచాయతీలు 25 శాతం నిధులుతో అభివృద్ధి పనులు చేస్తారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయప్రకాశరావు, నీలాపు మహేష్ రెడ్డి, రావాడ గోవింద్ రెడ్డి, సురేష్ రెడ్డి, పి. రామకృష్ణ, పంచాయితీరాజ్ ఏఈ కచేరి, ఏపీవో హేమలత తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు శిక్షణ

విశాలాంధ్ర-పాయకరావుపేట: మండలంలోని పంచాయితీ ఉప సర్పంచ్ లు, వార్డు సభ్యులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నర్సీపట్నం డి.ఎల్.పి.ఓ. మూర్తి పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. పంచా యతీ సమావేశాలు నిర్వహణ, పారిశుధ్యం మెరుగు, తాగునీరు, పంచాయతీల అభివృద్ధి తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డి చంద్రశేఖర్, సూపరిండెంట్ రవి వర్మ, పంచాయతీ కార్యదర్శులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమం

విశాలాంధ్ర-యస్. రాయవరం: మండలంలో తిమ్మాపురం, పెదగుమ్ములూరు, పెద్ద ఉప్పలం, గుడివాడ, దార్లపూడి తదితర గ్రామాల్లో పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న రోడ్లు కాలువల నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు . ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ ,ఏపీవో ఎర్రకయ్య ,మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు అమలకంటి అబద్దం తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురండి: తహసిల్దార్ జె. రమేష్ బాబు

విశాలాంధ్ర-యస్. రాయవరం : రీ సర్వే జరిగిన సమయంలో రైతుల పెండింగ్ సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తహసిల్దార్ జె .రమేష్ బాబు రైతులను అభ్యర్థించారు. రీసర్వే గ్రామ సభలో భాగంగా ధర్మవరం గ్రామంలో సమావేశం ఏర్పాటు చేశారు. పలువురు రైతులు తమ సమస్యలను తహసిల్దార్ దృష్టికి తీసుకు రావడం జరిగింది .పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో మండల సర్వేయర్ త్రిమూర్తి

సిసి రోడ్డుకు శంకుస్థాపన

విశాలాంధ్ర-నక్కపల్లి : ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి పల్లె పండుగ వారోత్సవాలు అనే కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నక్కపల్లి మండలంలో భాగంగా ఈరోజు సిహెచ్ బి అగ్రహారం, న్యాయంపూడి, కాగిత, డిఎల్ పురం, చందనాడ పంచాయతీల్లో సీసీ రోడ్లకు సంబంధించి శంకుస్థాపన కార్యక్రమం నక్కపల్లి మండల టిడిపి అధ్యక్షులు శ్రీ కొప్పిశెట్టి వెంకటేష్ గారి ఆధ్వర్యంలో సంబంధిత అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఎక్స్ జడ్పిటిసి కురుందాసు నూకరాజు కొప్పిశెట్టి కొండబాబు వెలగా సుధాకర్ కొప్పిశెట్టి బుజ్జి, అకేటి గోవిందరావు ,వెలగా శ్రీనివాసరావు , బీసీ సెల్ అధ్యక్షులు గింజల లక్ష్మణ్ రావు, గింజల శ్రీను కొంద్ర కనకారావు గారు,నానేపల్లి రాఘవ వెదుళ్ళ పాపారావు, అడపా గణేష్ పుణ్యమంతుల బాబ్జి ,ఎన్డీఏ కూటమి నాయకులు అందరూ కలిసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

గ్రామసభలతోనే భూ సమస్యలు పరిష్కారం అవుతాయి

విశాలాంధ్ర-చీడికాడ: గ్రామసభలతోనే భూ సమస్యలు పరిష్కారం అవుతాయని తహసిల్దార్ ప్రసాద్ అన్నారు మండలంలోని చీడిపల్లి గ్రామంలో భూ సమస్యలపై రిసర్వే రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించారు ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గతంలో జరిగిన భూరిసర్వేలో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి వాటిని పరిష్కరిస్తామన్నారు రైతులు తమయొక్క సమస్యలను దరఖాస్తుల ద్వారా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్వేర్ గణేష్ విఆర్ఓ కనకమహాలక్ష్మి ఆర్ఐ ఏ కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రవాయి ప్రాంతంలో తాగునీటి సమస్య నివారించండి

విశాలాంధ్ర-బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట మండలం లో ఎర్రవాయి ప్రాంతం లో ప్రజలు త్రాగు నీటి కొరకు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఈ సమస్యను పరిష్కరించాలని రాజ్యసభ సభ్యులు వై. వి. సుబ్బారెడ్డి కి అనకాపల్లి జిల్లా జడ్పీటీసీ ఫోరమ్ అధ్యక్షులు దొండా రాంబాబు వినతి పత్రం అందజేశారు కార్యక్రమం లో ఆకుల హెల్పింగ్ ఫౌండేషన్ అధినేత నాగేశ్వరావు, తైపురం గ్రామం సర్పంచ్ శ్రీను పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి

విశాలాంధ్ర-యస్. రాయవరం : మండలంలో ధర్మవరం అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వాల్మీకి మహర్షి జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బి. శ్రీనివాసరావు మాట్లాడుతూ.... ఒక బోయవాడు యావత్తు ప్రపంచానికి ఆదర్శవంతమైన రామాయణాన్ని అందించారని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు అనంతరం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లలితాంబ, విమల, శోభ, అరుణ, అప్పలనాయుడు, గారా ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికలతోనే పంచాయతీల అభివృద్ధి

విశాలాంధ్ర-రాంబిల్లి: పంచాయతీల అభివృద్ధికి తోడ్పడాలని వక్తలు పిలుపు నిచ్చారు. గురువారం ఎంపీడీవో కార్యాలయం లో ఉప సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ ఓ పి ఆర్ డి సన్యాసిరాజు రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరిస్తూ పారిశుధ్యం, వ్యర్థాల నిర్వహణలో గ్రామ పంచా యతీల పాత్రపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ విధులు, బాధ్యతలు, పంచాయతీరాజ్ చట్టం, కామన్ అడ్మినిస్ట్రేషన్ ప్రాసెసర్, పారిశుద్ధ్యం,ఘన వ్యర్థాల నిర్వహణ, గ్రామ పంచాయతీల పాత్ర, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, గ్రామపంచాయతీ సంబంధిత గైడ్‌లైన్స్, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ సిస్టం, వేస్ట్ కలెక్షన్ ప్రాసెస్, వర్మీ కంపోస్ట్ మార్కెటింగ్, వీధి దీపాలు వాటి నిర్వహణ వంటి అంశాలపై సవివరముగా శిక్షణ ఇచ్చారు. హాజరైన ప్రతి ఒక్కరూ శిక్షణ తరగతులు పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లు,వార్డు సభ్యులు, ఎంపిడిఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పత్రిక ప్రతినిధి దొడ్డి ముత్యాలునాయుడు ఆర్థిక సహకారంతో

'కమ్యూనిటీ ఫ్రిడ్జ్' ద్వారా పేదలకు ఆహారం

విశాలాంధ్ర-చోడవరం: చోడవరం లో స్థానిక స్వయం భూ వినాయక దేవస్థానం ఆవరణలో సద్భావ టీం ఏర్పాటు చేసిన 'కమ్యూనిటీ ఫ్రిడ్జ్' ద్వారా ఆంధ్రప్రభ పత్రిక ప్రతినిధి, చోడవరం సర్కిల్ ఇన్చార్జి దొడ్డి వెంకట ముత్యాలు నాయుడు (వెంకటేష్) దంపతులు ఆర్థిక సహకారంతో గురువారం పేదలకు భోజనాలు వితరణ చేశారు. అన్ని దానాల్లోకి అన్నదానం మహాభాగ్యమని నాయుడు తెలియజేసారు. సాధారణంగా తమచే విజయరామరాజు పేటలో ప్రతిష్టింపబడిన షిర్డీసాయి ఆలయంలో పలు సేవా కార్యక్రమాలు చేపడతామని, కమ్యూనిటీ ఫ్రిడ్జ్ ద్వారా ఆహారం వితరణ చేసే అవకాశం వుండటంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో సి.డి.వి.ఎం. కమ్యూనిటీ ఫౌండేషన్ అడ్మిన్ కొప్పాక రాజేష్, వినాయకుని గుడి ప్రధాన అర్చకులు కొడమంచిలి చలపతిరావు, పసుమర్తి శ్రీనివాసరావు (బ్రూక్ బాండ్ శ్రీను), ఉప్పల లక్ష్మి, సద్భావ టీం సభ్యులు పాల్గొన్నారు.

...

పోటీ ప్రపంచంలో విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

విశాలాంధ్ర-కే కోటపాడు : విద్యార్థులు ఇంగ్లీష్, జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ అంశాలపై అవగాహన కల్పించుకుని ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాలకు పోటీపరీక్షలకు ప్రిపేరై ఉన్నత అవకాశాలు పొందాలని యూత్ సర్వీసెస్/సెట్విస్ రిసోర్స్ పర్సన్ ఎస్.ఎ.బాబు అన్నారు. యువజన సర్వీసుల శాఖ-సెట్విన్ వారి సంయుక్త ఆధ్వర్యంలో గురువారం స్థానిక అయ్యన్న విద్యా సంస్థలులో 8,9,10 తరగతులు, ఇంటర్, డిగ్రీ కాలేజీల విద్యార్థులకు పర్సనాలిటీ డెవలప్మెంట్, కెరీర్ కౌన్సెలింగ్, యూత్ క్లబ్ ల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అయన మాట్లాడుతూ ప్రస్తుతం అనేక ఉద్యోగ అవకాశాలున్నాయని, నైపుణ్యంగల మానవవనరుల కొరత మాత్రం ఉందన్నారు ఉద్యోగానికి కావాల్సిన విద్యార్హతలున్నప్పటికీ ఇంటర్వ్యూలలో ఒత్తిడికి గురై సరైన కమ్యూనికేషన్ స్కిల్స్‌లేక ఉద్యోగాలు పొందలేక పోతుంటారన్నారు. చదువుతున్న కోర్సులు పూర్తయిన తరువాత వృత్తి నైపుణ్యం కోర్సులు కూడా నేర్చుకోవాలని సూచించారు. దీంతో మంచి ఉద్యోగ అవకాశాలు పొందవచ్చన్నారు. అలాగే యూత్ క్లబ్ ల ఏర్పాటుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అయ్యన్న విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఖాశీం మాట్లాడుతూ యువత తమ అభిరుచులు,ఆసక్తులు గమనిస్తూ ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా కెరీర్ ను నిర్మించుకోవాలని సూచించారు. యువజన సర్వీసుల శాఖ, సెట్విస్ సంయుక్తంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగ పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో బి.వివేక్, యువజన సర్వీసుల శాఖ సిబ్బంది, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేలో జరిగిన పొరపాట్లను సరి చేయడానికే గ్రామ సభ

విశాలాంధ్ర-రాంబిల్లి :: భూముల రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు ఏర్పడిన సమస్యలను పరిష్కరించేందుకే గ్రామ సభలు నిర్వహిస్తున్నామని రాంబిల్లి మండల తాశీల్దార్ శ్రీనివాసరావు అన్నారు.అనకాపల్లి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం నాడు మండలంలో చాటమెట్ట గ్రామంలో రీ సర్వే భూ సమస్యల పరిష్కార గ్రామ సభను నిర్వహించారు.ఈ సందర్భంగా రైతుల నుంచి 28 ఫిర్యాదులు వచ్చాయాయన్నారు. వాటిలో 26 ఫిర్యాదులు రీ సర్వేకు సంబంధించినవి కాగా మిగతా 6 సాధారణ భూ సమస్యలపై రైతులు ఇచ్చినట్లు ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆర్ ఐ రవి కుమార్,రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే డయేరియా మరణాలు

- మృతుల కుటుంబాలకు రూ.25లక్షల నష్టపరిహారం చెల్లించాలి
- రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి సూర్యనారాయణ డిమాండ్

విశాలాంధ్ర-చీపురుపల్లి : ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే గుర్ల గ్రామంలో డయేరియాతో ఆరుగురు మృతిచెందారని, ఇందుకు ప్రభుత్వమే బాధ్యత వహించి మృతుల కుటుంబాలకు రూ.25లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నవారందరికీ మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు. గడిచిన నాలుగైదు రోజులుగా డయేరియాతో గుర్ల గ్రామం తల్లడిల్లుతున్న విషయం విధితమే. వరుస మరణాలతో గ్రామస్తులు భయాందోళనలకు గురౌతున్నారు అన్నారు. ఈనేపథ్యంలో ఆ గ్రామాన్ని, చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని గురువారం నాడు తమ్మినేనితోపాటు ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టివి రమణ, పార్టీ గరివిడి ప్రాంత నాయకులు అంబళ్ళ గౌరినాయుడు కలిసి సందర్శించారు. స్థానికులతో మాట్లాడి వాస్తవ పరిస్థితులను అవగతం చేసుకున్నారు. అనంతరం చీపురుపల్లి సిహెచ్‌సిలో చికిత్స పొందుతున్నవారిని కూడా పరామర్శించారు. మెరుగైన చికిత్స అందజేయాలని, అవసరమైతే రోగుల ఇబ్బందులు అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని స్థానిక వైద్యాధికారులను కోరారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ గుర్ల సహా పలు గ్రామాల్లో డయేరియా ప్రబలి నట్టు ఆరు రోజుల క్రితమే బయటపడినప్పటికీ ఇప్పటికీ అదుపు చేయలేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. నేటి ఆధునిక సమాజంలో ఇంకా నీరు కలుషితం అవ్వడానికి కారణాలు తెలియలేదని మంత్రి ప్రకటించడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వ లేబరేటరీలు, అందులో సిబ్బంది అధికారులు ఏమయ్యారని ప్రశ్నించారు. ఇప్పటికైనా వైద్యనిపుణులను డయేరియా ప్రబలిన గ్రామాలకు పంపాలని డిమాండ్ చేశారు. కేవలం స్థానిక ఆసుపత్రులతో కాలక్షేపం చేస్తే మరింత నష్టం జరిగే ప్రమాదం లేకపోలేదని వివరించారు. ఇప్పటికే గుర్ల మండలంలోని పలు గ్రామాలతోపాటు గరివిడి, చీపురుపల్లి గ్రామాల్లో కూడా డయేరియా వ్యాపించి ఉందని, అధికారులను, ప్రజలను అప్రమత్తం చేయడంతోపాటు మందులు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని అన్నారు. అధికారులు, మంత్రుల పర్యటనల కన్నా మృతుల కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. బాధిత కుటుంబాల వారు ఆర్థికంగా ఇబ్బందిపడే ప్రమాదం ఉందని అన్నారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, రక్షిత నీటి సరఫరాను గాలికి వదిలేసి పల్లెపండగలు చేసుకోవడం వల్ల జనాలకు ఎలాంటి ఉపయోగం ఉండబోదన్నారు.

తారాపురంలో ఎమ్మెల్యే బేబీ నాయన రోడ్డు పనులకు భూమిపూజ

విశాలాంధ్ర-రామభద్రపురం : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన "పల్లె పండుగ" కార్యక్రమం తారాపురం గ్రామంలో గురువారం ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్.కే.కే.రంగారావు (బేబీ నాయన) మెయిన్ రోడ్ నుంచి సాకలి వీధికి వెళ్లే సిమెంట్ రహదారి నిర్మాణమునకు భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే బేబీ నాయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం పల్లెల అభివృద్దే లక్ష్యంగా ముందుకు వెళ్తుందని, రామభద్రపురం మండలానికి గాను లిరూ5,13,11,000/-లి మంజూరైనట్లు తెలిపారు. అందులో భాగంగానే కాలువలు సిమెంట్ రోడ్లు నిర్మాణం చేసి గ్రామాలను అభివృద్ధి బాటలో నడిపించడం జరుగుతుందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలులో భాగంగా ఈ అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి శ్రీ చింతల రామకృష్ణ గారు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీ మడక తిరుపతిరావు , మండల టీడీపీ అధ్యక్షులు శ్రీ కరణం భాస్కరరావు తారాపురం సర్పంచ్ బెవర రవణమ్మ ఎంపీటీసీ బెవర సునీత , సర్పంచ్ ప్రతినిధి బెవర సీతారాం , వైస్ సర్పంచ్ పొట్టంగి సీతారాం , మాజీ ప్రెసిడెంట్ కాశమ్మ వార్డు మెంబర్లు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూ సభలు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-కోటవురట్ల: రెవెన్యూ సభలు సద్వినియోగం చేసుకోవాలి గ్రామాల్లో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి గ్రామాల్లో జరిగే రెవిన్యూ సభలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని తహసిల్దార్ తిరుమల బాబు అన్నారు గురువారం సుంకపూరు గ్రామంలో రెవెన్యూ సభను తహసిల్దార్ తిరుమల బాబు ప్రారంభించారు. సభలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రీ సర్వే భూ సమస్యల పరిష్కారానికి సరిహద్దుల పరిష్కారం భూ వివాదాలు వంటి సమస్యలను గ్రామ సభలో పరిష్కరించబడతాయని ఆయన తెలిపారు ఈనెల 17 నుండి 29 వరకు షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామాల్లో గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు ఈ సదస్సులను ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపిటిసి లాలం స్వామి నాయుడు ఆర్ ఐ ఉర్ధవరావు వీఆర్వో సర్వేయర్ రైతులు పాల్గొన్నారు.

శివాలయం లో భారీ అన్న సమారాధన

విశాలాంధ్ర-చోడవరం: రాష్ట్రంలోని స్వయం భూ శివాలయాలు అన్నింటిలో అత్యంత మహిమాన్వితమైన చోడవరం గంగా సమేత పురాణ గౌరీ పరమేశ్వరుల దేవాలయంలో భక్తులు, దాతల సహకారంతో గురువారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఆశ్వియుజ పౌర్ణమి సందర్భంగా గంగా సమేత పురాణ గౌరీ పరమేశ్వరులకు వేకువ జాము నుండి ఏకాదశ రుద్రాభిషేకం, పంచామృత అభిషేకం, అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచలి చలపతిరావు, కార్యనిర్వహణాధికారి ఎస్.వి.వి. సత్యనారాయణ మూర్తి, శివాలయ భక్త కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వంగర లో పిడుగుపాటుకు బడ్డీ ధ్వంసం

పాడైన రూ.3లక్షల విలువైన వస్తువులు

విశాలాంధ్ర-వంగర: మండల కేంద్రం వంగర ఎంపిడిఓ కార్యాలయంలో సమీపాన పడిన పిడుగుపడింది, గురువారం సాయంకాలం పిడుగులతో వర్షంకురిసింది. పిడుగు ఎంపిడిఓ కార్యాలయం ఆవరణలో ఉన్న ఆవు పైడి తల్లికిరాణా షాపు వద్దపిడుగుపటంతో షాపు, పూర్తిగా బీటలు వారింది. కిరాణా షాపు లో ఉన్నటువంటి ఎంతో విలువైన వస్తువులు సుమారు గా మూడు లక్షలరూపయల విలువగల సామగ్రి పాడయ్యాయి. కిరాణా షాపు లో ఉన్నటువంటి ఫ్రిజ్, జిరాక్స్ మిషన్, విద్యుత్ మీటర్లు, ఫ్యాన్ లు, పూర్తిగా పోవటమే కాకుండా కిరాణా షాపుకు దగ్గర్లో ఉన్న టువంటి పైడితల్లి ఇంటిలో ఉన్నటువంటి ఏసీ,ఇన్వయిటర్ అరుఫ్యాన్లు, ఇంటి విద్యుత్ మీటర్ పాడ య్యింది. అంతేకాకుండా ఎంపిడిఓ కార్యాలయంలో ఏమేమి పడయ్యాయన్నది తెలియ లేదు. ఇన్వయిటర్ పనిచేయనట్లుందని ఎంపిడిఓ త్రి నాద రావు వివరించారు. ఇంకేమి పాడయ్యాయన్నది తెలియ వలసి ఉందన్నారు. తహశీల్దార్ కార్యాల యంలో ఆరు ఫ్యానులుపాడై నట్లు కార్యాలయ సిబ్బంది సమా చారం మేరకు తెలిసింది.

గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి : తహశీల్దార్ సత్యనారాయణ

విశాలాంధ్ర-పాయక రావుపేట: మండ లంలోని ఎన్.నర్సాపురం గ్రామంలో రెవిన్యూ అధికారులు గ్రామ సభ నిర్వహించారు. ఇటీవల జరిగిన రీ సర్వేపై సమస్యలు ఎదుర్కొన్న రైతులు గ్రామసభ దృష్టికి తీసుకురావాలని తహసిల్దార్ సత్యనారాయణ కోరారు. ఈ సందర్భంగా రైతుల నుంచి 9 వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పల్లెల మణికంఠ స్వామి, మంచాల గోపి, డీటీలు ఆనందరావు, రాజేంద్రప్రసాద్, ఆర్. ఐ. త్రినాథ్, వీఆర్వోలు పాల్గొన్నారు.